క్లుప్తంగా

వెండి తోరణాన్ని బహూకరించిన వనమా



తోరణంతో వనమా దంపతులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ సమూదాయంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతులు సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి వితరణ చేసిన వెండిమకర తోరణానికి ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఆర్‌కె ఆచార్యులు, రమణ మూర్తినాయుడు పాల్గొన్నారు.

కోతులకు ఆహారం అందజేత



ఆహారం అందజేస్తున్న ధీరజ్, స్నేహితులు

కొత్తగూడెంటౌన్: లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లందు క్రాస్ రోడ్డు వెంట ఉన్న కోతులకు అరటిపండ్లు, అటుకులు, మంచినీళ్లను అందజేసి కొత్తగూడెం హనుమాన్ బస్తీకి చెందిన పర్సా ధీరజ్ మానవత్వం చాటుకున్నారు. సోమవారం తన సోదరుడు పర్స దినేష్ జ్ఞాపకార్థం 30 కేజీల అటుకులు, అరటిపండ్లు, మంచినీళ్లను తన స్నేహితులు ఎండీ.ఖలీల్, వెంకటేష్‌లతో కలిసి అందజేశాడు. ఈ మేరకు పలువురు ధీరజ్‌ను అభినందించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

ఇల్లెందు: తెలంగాణ ఉద్యమకారుడు, మున్సిపాలిటీలోని 22వ వార్డుకు చెందిన సుందరగిరి శ్రీను సోమవారం మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, దిండిగాల రాజేందర్ సమక్షంలో తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఐతా ఫంక్షన్‌ హాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను నమ్మి కాంగ్రెస్‌లో చేరిన తిరిగి బీఆర్‌ఎస్‌లోకి రావడం ఖాయమని అన్నారు.

యుద్ధభేరిని జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: యూనిఫైడ్ పెన్షన్ విధానం(యూపీఎస్)ని వ్యతిరేకిస్తూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో మార్చి 2న హైదరాబాద్‌లో నిర్వహించే యుద్ధభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం జిల్లా నాయకులు బి.నాగు నాయక్, హాతీరాం నాయక్, కుంజా రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుద్ధబేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా యూపీఎస్ పేరుతో మరో కొత్త విధానాన్ని సంఘం పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ విధానం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తే ఉద్యోగ ఉపాధ్యాయులకు పోరాడి సాధించుకున్న ఫలాలు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్ విధానం అమలుపరచకుండా చూడాలని కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పెట్టినట్టుగా రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయుల పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. నాయకులు రమణ, ఫుల్సింగ్, రమేష్, హీరోలాల్, రవికుమార్, మోహన్ రావు, చందర్ సింగ్ పాల్గొన్నారు.

పరామర్శ..

ఇల్లెందు: పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త ఘనశ్యామ్ లాహోటీ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, దిండిగాల రాజేందర్ సోమవారం పరామర్శించారు. ఈ మేరకు ఘనశ్యాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు సాయి తండ్రి పోషంను పరామర్శించారు.

రైతుబేజార్..



కొత్తగూడెంలోని రైతుబజార్

ఆదరణ కోల్పోతున్న కొత్తగూడెం రైతుబజార్

- రోడ్లపై విచ్చలవిడిగా దుకాణాల ఏర్పాటు
- మున్సిపల్ మార్కెట్‌లో ఖాళీగా షెడ్లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రైతుబజార్‌కు ఆదరణ కరువవుతోంది. గతంలో కంటే తక్కువగా అమ్మకాలు జరుగుతుండడంతో రైతులు ఇబ్బంది అవస్థలు పడుతున్నారు. 1999 సంవత్సరంలో రైతుబజార్‌ను ఏర్పాటు చేయగా అప్పుడు 120 దుకాణాలు రైతులు ఏర్పాటు చేసుకోగా కూరగాయల అమ్మకాలు చేసేవారు. కాలక్రమేణా రైతుబజార్ పక్కన ఇంటిగ్రేటేడ్ మార్కెట్ నిర్మాణం పనులు ప్రారంభంలో రైతుబజార్‌ను కూల్చివేసి, అందులో వ్యాపారం చేసే వారికి తాత్కాలికంగా పక్కన షెడ్లను ఆరేళ్ల క్రితం ఏర్పాటుచేయగా షెడ్లలో వ్యాపారం చేసే రైతులు ఇబ్బందులు పడుతూ వ్యాపారం చేస్తున్నారు. అదీ చాలక ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్ వారి దందాకు తట్టుకోలేక, వ్యాపారాలు నడవక అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు మార్కెట్ తాకిడి ఎక్కువ కావడంతో గతంలో ఉన్న 120 షాపుల నుంచి ప్రస్తుతం 80 వరకు రైతుబజార్‌లో దుకాణాలు మాత్రమే మిగిలాయి.

ఎక్కడపడితే అక్కడే..

ప్రైవేట్ వ్యాపారస్తులకు రైతుబజార్ ఎదురుగానే మున్సిపల్ ప్రైవట్ మార్కెట్‌కు షెడ్లు నిర్మించి అందులో వ్యాపారం చేయాలని మున్సిపల్ అధికారులు చెప్పినప్పటికీ రోడ్లపై దుకాణాలు పెట్టుకోవడంతో మున్సిపల్ మార్కెట్‌లోని షెడ్లు ప్రస్తుతం కొన్ని ఖాళీగా దర్శనమిస్తున్నాయి. రైతుబజార్‌కు వినియోగదారులు రావాలంటే ప్రైవేట్ దుకాణాలను దాటుకుని రావాల్సి ఉండగా ప్రైవేట్ దుకాణాల వద్దే కొనుక్కుని వెళ్లిపోతున్నారు. దీంతో రైతుబజార్‌కు వచ్చే వినియోగదారుల సంఖ్య రోజురోజుకు తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. రోడ్లపై అమ్మకాలు జరుగుతుంటే రైతుబజార్‌కు వచ్చి కూరగాయలను కొనుగోలు చేసే వారి సంఖ్య తగ్గుతుంది. దీనికి తోడు ప్రతీ ఆదివారం వార సంతలో కూరగాయల అమ్మకాలు జరుగుతుంటే రైతుబజార్‌లో అమ్మకాలు తగ్గిపోతున్నాయి. రైతుబజార్ ఏరియాలో నిర్మాణం అవుతున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు వేగవంతం చేసి అందులో దుకాణాలను రైతులకు వెంటనే కేటాయించి సౌకర్యం కల్పించి, రోడ్లపై ఉన్న దుకాణాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు..



రైతుబజార్ ఎదురుగా ఉన్న ప్రైవేట్ మార్కెట్..

పట్టణ పరిధిలో హెడ్డాఫీసు సెంటర్‌లోని మూడు ప్రాంతాల్లో, బాబుక్యాంపు రోడ్డు పొడుగుతా దుకాణాలు, సెవెన్‌హిల్స్ ఏరియాలో దుకాణాలు, రైల్వేస్టేషన్‌కు పక్కన ఉన్న రోడ్డు, సూపర్‌బజార్ పెట్రోల్ బంక్ దగ్గర, చిన్న బజార్, పెద్దబజార్ రోడ్ల వెంట కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయడంతో జనం రోడ్లపైనే ఆగి కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో రోడ్లపై దుకాణాలు, అక్కడికి వచ్చే వాహనదారులు, ప్రజలతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతుంది. రోడ్లపై అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసిన కూడా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..



రోడ్లపై అనుమతులు లేకుండా కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దీంతో పాటుగా రైతుబజార్‌కు వెళ్లే వారి సంఖ్య కూడా తగ్గుతుంది. రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి హెచ్చరించి, అనంతరం దుకాణాల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

– శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్

సేవాలాల్ జయంతి వేడుకలు



సూపర్‌బజార్(కొత్తగూడెం): పూలమాల వేస్తున్న సునీల్‌కుమార్



జూలూరుపాడు: బహుమతులు అందజేస్తున్న టీఎస్‌టీటీఎఫ్ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సోమవారం బంజారా ఆధ్యాత్మిక గురువు సంత్ సేవాలాల్ యంతి వేడుకలను నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కె.సునీల్‌కుమార్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రిన్సిపల్ సిహెచ్ శారద, కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

జూలూరుపాడు: శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా టీఎస్‌టీటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను వ్యాసరచన పోటీగా నిర్వాహకులు నిర్వహించారు. విజేతలకు టీఎస్‌టీటీఎఫ్ మండల అధ్యక్షుడు గుగులోత్ సీతారాములు, ప్రధాన కార్యదర్శి ధరావత్ హనుమా జాదవ్ బహుమతులు అందజేశారు. టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బానోత్ శ్రీను, జిల్లా కార్యదర్శి బానోత్ నేతాజీ, మండల మహిళా అధ్యక్షురాలు స్వరూప, హైస్కూల్ హెచ్‌ఎంలు లక్ష్మీనర్సయ్య, మీరా సాహెబ్, సంజీవరావు, ఉపాధ్యాయ బృందం లలిత, భిక్షం, శ్రీనివాసరావు, గురుమూర్తి, కృష్ణ, శకుంతల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలు అమలయ్యే వరకు ఉద్యమం



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రకటించిన ఆరుగ్యారంటీలను అమలు చేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాగేశ్వరరావు, పొడుగు నర్సింహారావు, రాసుద్దీన్, ఆజ్మీర శంకర్, మోకాళ్ల రమేష్, సామేలు ఉన్నారు.


టేకులపల్లి: ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు ఆవునూరి మధు, మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, దుబాకుల ప్రసాద్, భూక్య హర్ష్య, నర్సింగు, నరసింహారావు, గుగులోతు రామచందర్, మంచా, భానుచందర్, సతీష్, భద్రం, నరేష్, మహేష్, ఊకే సురేష్, గుగులోతు ప్రసాద్ పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

ఇల్లెందు: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లెందులోని ఫంక్షన్ హాలులో 71 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు రక్తదానం చేశారు. అనంతరం ఆస్పత్రిలో పండ్లు, పాలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, జిల్లా మాజీ గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, లకావత్ దేవీలాల్ నాయక్, సత్యనారాయణ, శీలం రమేష్, రేణుక, జబ్బార్, రవి, హరిప్రసాద్ యాదవ్, చాంద్‌పాషా, రాజేష్ తదితరులు ఉన్నారు.

పాల్వంచ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కేక్ కట్ చేసి, రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్, సింధు తపస్వీ, మంజుల, సమ్మయ్యగౌడ్, హర్ష, ఉన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో టీబీజీకేఎస్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి కేక్ కట్ చేసి, మొక్కలు నాటి, జ్యోతి అనాథ శరణాలయంలో పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ, కాపు కృష్ణ, కూసన వీరభద్రయ్య ఉన్నారు.



ఇల్లెందు: మొక్క నాటుతున్న నాయకులు

సుజాతనగర్: మండలకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మొక్క నాటి ఆస్పత్రిలోని గర్భిణులు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

జూలూరుపాడు: స్థానిక సాయిబాబా ఆలయంలో బీఆర్‌ఎస్ నాయకులు యల్లంకి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

టేకులపల్లి: బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో కేక్, స్వీట్లు పంపిణీ చేశారు. టపాసులు పేల్చి సంబురాలు చేశారు.



పాల్వంచ: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



సింగరేణి(కొత్తగూడెం): టీబీజీకెఎస్ కార్యాలయంలో..

నీటిఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: వేసవి సమీపిస్తున్నందున తాగునీటి ఎద్దడిని అధిగమించేలా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో తాగునీటి ఎద్దడికి అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించాలన్నారు. సరఫరా నిలిచిపోయినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలు మండుతున్నందున నర్సరీలలో మొక్కలకు ఇబ్బంది కలుగకుండా క్రమం తప్పకుండా నీటిని అందించాలని, ప్రతీ రోజు నర్సరీలను సందర్శించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ బాలాజీ, ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

పాల్వంచ: భారతరత్న, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కేటీపీఎస్ బీసీ అసోసియేషన్ హాల్ నందు నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కొమరవెల్లి రవీందర్, ప్రెసిడెంట్ ఉప్పెర్ల పుల్లారావు, వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, వెంకన్న, శ్రీనివాస్, రాంప్రసాద్, ఉదయ్‌కుమార్, మహేశ్, యశ్వంత్ సాయి, గోపికృష్ణ, తేజ, రాజు, మహేశ్, కృష్ణ, రాజు, నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

డీ బ్లాక్‌లో లోడింగ్ షురూ..



బొగ్గు ట్రాన్స్‌పోర్టు ప్రారంభిస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఏడాదిగా మూతపడిన డీ బ్లాక్‌లో బొగ్గు రవాణా ఎట్టకేలకు ప్రారభమయ్యింది. సోమవారం ఇల్లెందు ఏరియా సింగరేణి డీ బ్లాక్‌లో బొగ్గు లోడింగ్‌ను ఓసీ మేనేజర్ పూర్ణచందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బొగ్గు లోడింగ్ కోసం కృషి చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కోల్ బ్రాంచి ఇన్‌చార్జ్ కాందాస్, వేబ్రిడ్జ్ క్లర్క్‌లు రాంబాబు, కోల్ ట్రాన్స్‌పోర్టు అధ్యక్షుడు రాంచంద్రయ్య, లారీ ఓనర్స్ అధ్యక్షులు మౌలానా, యాకుబ్‌షావలీ పాల్గొన్నారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా రేపు నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తు బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక మంచికంటి భవన్‌లో వామపక్షాల జిల్లా ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను ప్రతిపాదించారని, ఈ బడ్జెట్ కార్పొరేట్‌కు అనుకూలంగా, పేదలపై భారం మోపే విధంగా ఉందన్నారు. బడ్జెట్‌ను సవరించి కార్పొరేట్లపై నాలుగు శాతం పన్నులు విధించి ప్రజల సంక్షేమ పథకాలకు అధికంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అందుకు ప్రత్యామ్నయ బడ్జెట్‌ను రూపొందిస్తే కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచుతామని లేకపోతే ప్రభుత్వం నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈఅన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కులగణనలో తీవ్ర అన్యాయం



సమావేశమైన నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో మున్నూరుకాపులకు తీవ్ర అన్యాయం జరిగిందని సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని మున్నూరుకాపు సంక్షేమసంఘం భవనంలో సోమవారం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన సర్వేలో మున్నూరు కాపులు 20 లక్షలు ఉన్నట్లు లెక్కలు చెబుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 14 లక్షలకు సంఖ్య ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. తమకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 24న కొత్తగూడెంలో మున్నూరు కాపులు భారీ ర్యాలీ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కెవి రంగాకిరణ్, నాయకులు ఎడవల్లి కృష్ణ, కాసుల వెంకట్, శ్రీధర్, కాంపెల్లి కనకేష్, చింత నాగరాజు, రుక్మాంధర్, సంఘం అధ్యక్షుడు కాసా హనుమంతరావు, కార్యదర్శి లింగాల గోపాలకృష్ణ, కోశాధికారి సత్యనారాయణ, పురుషోత్తం, జోగం తారక్, సత్యనారాయణ, నర్సయ్య, హనుమంతు, ఆది రామస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించండి



ప్రచారంలో బీజేపీ నాయకులు

జూలూరుపాడు: బీజేపీ వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని హైస్కూళ్లలో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేసిందని, రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, తెల్లం నరసింహారావు, సిరిపురపు ప్రసాద్, గోపాల్‌రావు, నర్వనేని కృష్ణ, శ్రీనాథ రాజు వాసు, వందనపు సుబ్బు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఇల్లెందు: టీయూసీఐ అనుబంధ హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ ఈ నెల 21న ఖమ్మం పట్టణంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని టీయూసీఐ నేత యాకుబ్ షావలీ, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు సోమవారం ఇల్లెందులోని జీసీసీ కార్యాలయం వద్ద జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎలేందర్, సంపత్, సీతారాములు, రవి, శ్రీను, సందీప్, పవన్, కళ్యాణ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచరూరల్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ కుల సర్వేలో వివరాలు నమోదు చేసుకోలేని కుటుంబాలు ఈనెల 16 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న సర్వేలో వివరాలను నమోదు చేసుకోని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీడీఓ సోమవారం సదర్శించి మాట్లాడారు. టోల్‌ఫ్రీ నంబర్ 040-2111111లో, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు.

అటానమస్‌గా గుర్తింపు

పాల్వంచ: పట్టణంలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, జవహర్‌లాల్ నెహ్రు టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్‌తో ప్రతిష్ఠాత్మకమైన అటానమస్ గుర్తింపు లభించిందని కళాశాల చైర్మెన్ డాక్టర్ టి.భరత్ కృష్ణ అన్నారు. సోమవారం అటనామస్ గుర్తింపు లభించడంపై పోస్టర్లను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న, డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వి.సుబ్బారావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులే తరువాయి..!

- కొత్తగా ఆవిర్భవించనున్న 'గోపాతండా' గ్రామ పంచాయతీ
- ప్రతిపాదనలు పంపించిన అధికారులు

సుజాతనగర్: మండలంలో ఇప్పటి వరకు 20 గ్రామ పంచాయతీలు ఉండగా.. వాటి సంఖ్య 21కి చేరనుంది. మరో గ్రామ పంచాయతీ కావాలనే ప్రజల కోరిక మేరకు ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొత్త గ్రామ పంచాయతీ రానున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీలో ఉన్న గోపాతండా కొత్త గ్రామ పంచాయతీగా అవతరించనుంది. దీంతో మండలంలో గ్రామ పంచాయతీల సంఖ్య 20 నుంచి 21కి చేరుకుంటుంది.



గోపాతండా గ్రామం వ్యూ

మండలంలో సుజాతనగర్ పంచాయతీ తర్వాత పెద్ద పంచాయతీగా సర్వారం గ్రామ పంచాయతీ ఉంది. సర్వారంలో గోపాతండా, హరిలాల్ తండా, గుడితండా, గొల్లగూడెం, హలావత్ తండా, సర్పంచ్ తండా, ఒడ్డుగూడెం అనే గ్రామాలు ఉన్నాయి. పంచాయతీల విభజన సమయంలో అధికారులు ఈ గ్రామ పంచాయతీని రెండుగా చేయకపోవడంతో 7 గ్రామాలతో ఒకే పంచాయతీగా ఉంది.

పెద్ద గ్రామం గోపాతండా..

ఉమ్మడి సర్వారంలో మిగిలిన గ్రామాలు మినహా గోపాతండా పెద్ద గ్రామం. సర్వారంలో 3,305 మంది ఓటర్లు ఉండగా... గోపాతండాలో సుమారు 1,200 మంది జనాభా ఉన్నారు. ఓటర్లు సుమారు 660 మంది ఉన్నారు. గోపాతండా పెద్ద గ్రామం కావడంతో కేవలం ఈ ఒక్క గ్రామమే గ్రామ పంచాయతీగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. గోపాతండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఇక్కడి గ్రామస్తులు ఎప్పటి నుంచో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు సైతం అందజేస్తున్నారు. ఈ మేరకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

అభివృద్ధి చేసుకుంటాం...



కొత్తగా ఏర్పడబోయే గ్రామ పంచాయతీని అందరం కలిసి అభివృద్ధి చేసుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి.

– జర్పుల కుమార్, గోపాతండా

గ్రామ పంచాయతీగా ఏర్పడాలి...



మా గ్రామం గోపాతండా చాలా పెద్దది. కొత్త గ్రామ పంచాయతీ మాకు అవసరం. కొత్తగా గోపాతండా గ్రామ పంచాయతీ ఏర్పాటు చేస్తే మా పంచాయతీని పురోగతిలోకి తీసుకువెళ్తాం.

– భూక్యా స్వప్న, గోపాతండా

ప్రతిపాదనలు పంపించాం..



కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు కోసం ఉన్నతాధికారుల సలహాలు, సూచనలతో ప్రతి పాదనలను పంపించాం. ఈ గ్రామం పెద్ద గ్రామం కావడంతో పంచాయతీ ఏర్పాటుకు అవకాశం ఉంది.

– బి.భారతి. సుజాతనగర్ ఎంపీడీఓ